# ప్లాస్టిక్ తెప్పపై పసిఫిక్ సముద్ర ప్రయాణం!!



ఎండకు వళ్ళంతా కమిలిపోతుంటే, ఆకలికి కడుపు మండిపోతుంటే, ప్లాస్టిక్ చెత్తతో తయారు చేసిన చిన్న తెప్పపై మూడు నెలలు నిర్విరామంగా ప్రయాణించి పసిఫిక్ మహాసముద్రాన్ని దాటారు ఓ ఇద్దరు సాహసికులు. నలభైయ్యేళ్ళ మార్కస్ ఎరిక్‌సన్, ముప్ఫైరెండేళ్ళ జోయెల్ పాస్కల్ సముద్రంలో పెరుగుతున్న ప్లాస్టిక్ పదార్థాల కాలుష్యం గురించి అందరికీ అవగాహన కలిగించాలనుకున్నారు. అందరి దృష్టినీ ఆకర్షించే సాహసం చేస్తే తమ ఆశయానికి గుర్తింపు వస్తుందనుకున్నారు. అప్పుడే వాళ్ళకు ఈ అపూర్వమైన సాహసాన్ని గురించిన ఆలోచన తట్టింది. వెంటనే విరిగిపోయిన ఓడ చుక్కానులు, పదిహేను వేల ప్లాస్టిక్ డబ్బాలూ ఉపయోగించి ముప్ఫై అడుగుల తెప్పను తయారు చేసారు. దానిపైన ఓ విరిగిపోయిన విమానం పై భాగాన్ని చూరుగా అమర్చారు. అవసరపడే ఆహారాన్ని, త్రాగు నీటిని అంచనా వేసి సమకూర్చుకున్నారు. ఈ సంవత్సరం జూన్ ఒకటో తారికున తీరాన్ని వదిలి సముద్రంలోకి ప్రయాణం కట్టారు. అయితే అంతా వాళ్ళనుకున్నట్టు జరగలేదు. చాలా సమస్యలు ఎదురయ్యాయి. వాళ్ళ తెప్ప అనుకున్న దానికన్నా నెమ్మదిగా వెళ్ళడం మొదలుపెట్టింది. దాంతో తాము సమకూర్చుకున్న ఆహారం పూర్తిగా సరిపోదని వాళ్ళకు అర్థమైంది. చేసేదిలేక తిండి తగ్గించుకున్నారు. దానికి తోడు మధ్యలో తుపానులు కూడా ఎదురు కావడంతో తెప్ప కూడా దెబ్బతింది. ఒక దీవి లాంటి చోట ఆపి తెప్పను బాగు చేసి మళ్ళా ప్రయాణించేసరికి మరి కొన్ని రోజులు వ్యర్థమయ్యాయి. మరింత ఆహారం ఖర్చయి పోయింది. అదృష్టం కొద్దీ శాటిలైట్ ఫోన్ ఆదారంగా వాళ్ళు పంపిన సమాచారానికి దగ్గర్లో నుండే ప్రతిస్పందన లభించింది. అటుగా బోటు మీద పోతున్న సేవెజ్ అనే అమ్మాయి వీళ్ళ పిలుపు వింది. ఆ అమ్మాయి దగ్గర ఉన్న రెండు నీళ్ళ టాంకులు విరిగిపోవడంతో ప్రస్తుతం ఆమె దాహంతో అల్లాడుతోంది. వీళ్ళు ఇక్కడ ఆకలితో అల్లాడుతున్నారు. ఇకనేం, ఇరు బృందాలు నీటిని, ఆహారాన్ని మార్పిడి చేసుకుని ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు. విచిత్రమేమిటంటే సేవేజ్ కూడా ప్లాస్టిక్ పదార్థాల వల్ల సముద్రానికి కలుగుతున్న నష్టానికి వ్యతిరేకంగానే తన యాత్ర చేస్తోందట! ఎలాగైతేనేం, మూడు నెలల అష్టకష్టాల తరువాత, మొత్తం 2,600 మైళ్ళ దూరం ప్రయాణించి గత ఆగష్టు 28వ తేదీన ఇద్దరూ 'అలా వై హార్బర్' చేరుకున్నారు. ''చుట్టు ముట్టిన స్నేహితులతో నేను మొదట మాట్లాడిన మాట 'తింటానికేమైనా ఉందా' అని!'' అంటున్నాడు ఎరిక్‌సన్ నవ్వుతూ. వీళ్ళు సముద్రంపై ఇన్ని తంటాలు పడుతున్నా క్రమం తప్పకుండా ప్రతీ రోజూ తమ అనుభవాల్ని బ్లాగులో రాయడం, తాము తీసిన వీడియోల్ని బ్లాగులో పోస్టు చేయడం ఇవేవీ మర్చిపోలేదు. ప్రస్తుతం ఇద్దరూ చుట్టు ప్రక్కల గ్రామాల్లోని స్కూళ్ళలో ఉపన్యాసాల ద్వారానూ, వీడియో ప్రదర్శనల ద్వారాను సముద్రంలో ప్లాస్టిక్ పదార్థాల విడుదల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను గురించి పిల్లలకు అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. వీళ్ళ ప్రయత్నాలు విజయవంత మవ్వాలని ఆశిద్దాం!

'సరసి' కత

# కుడి ఎడమైతే..

వైశంపాయనుడు పెళ్ళైన కొత్తలో సంక్రాంతి పండక్కి అత్తారూరెళ్లాడు. పొలం నుంచి ధాన్యం బస్తాలు ఇంటికి తేవడానికి బండి కట్టాల్సి వచ్చింది మామ పురూరవుడుకి. రెండెడ్ల బండి ఉన్నా, ఆ రోజు పాలేరు జ్వరం వచ్చి పనిలోకి రాకపోవడం చేత, ఏంచెయ్యాలో పాలుపోలేదాయనకి.

''ఇదేం బ్రహ్మ విద్యా? నేను కడతాను మామా'' అన్నాడు వైశంపాయనుడు. ''నీకు అలవాటు లేదయ్యా, ఎందుకూ'' అని పురూరవుడు ఎంత నచ్చచెప్పినా అల్లుడు వినలేదు. బండి కట్టి తొట్లో నిలబడి, రెండు తాళ్లూ చేత్తో పట్టుకుని, కంసీ కర్రని గాల్లోకి తిప్పుతూ, ''సై సై జోడెడ్లా బండీ, సోకైన దొరలా బండీ'' అంటూ వరకట్నం సినిమాలో రాజనాలలా బండిని పరుగులు పెట్టించాలని వైశంపాయనుడు తహతహలాడేడు. పాకలో ఉన్న ఎడ్లని తెచ్చి బండికి చెరోవైపునా నిలబెట్టి, కాడెత్తి ''హెయ్ హెయ్, దద్దా'' అన్నాడు. పాలేరు అలా పిలవగానే వాటంతటవే తల వంచి కాడి కింద పెట్టడం గతంలో వైశంపాయనుడు చూశాడు. అయితే ఇప్పుడు అవి అలా రాలేదు. దాంతో చిర్రెత్తి కంసీకర్రతో రెండు తగిలించాడు. అయిష్టంగానే తలలు వంచేయి రెండెడ్లూనూ. బండి కట్టి, తొట్లో కూర్చుని ఎడ్ల తోకలు మెలిపెట్టి, ''హెయ్ హెయ్'' అంటూ ఉత్సాహంగా కేకలు పెట్టేడు. ఇంటి




అరుగు మీద నిలబడి అత్తమామలు, కొత్త పెళ్లాం 'సుబుల్' (పెళ్లయిన కొత్తలో సుబ్బాయమ్మని అలా ముద్దుగా పిలిచేవాడు) ఆశ్చర్యంతో అలా చూస్తూ వుండే సరికి వైశంపాయనుడు రెచ్చిపోయి, బండిని ముందుకు ఉరికించేడు.

ఎడ్లు కొంచెం దూరం పరుగెట్టి, బండిని అమాంతం పక్కనే ఉన్న చెరువులోకి లాగేశాయి. బండి తిరగబడబోయి నీళ్లలో కెళ్లి, ఆగిపోయింది. ఆ వూపుకు వైశంపాయనుడు ఎగిరి బురదలో పడ్డాడు! ''చెప్పులు కుడి ఎడమ ఎలా వుంటాయో, బండెడ్లు కూడా 'వెలపట, దాపట' అని ఉంటాయి. బండికి కుడిపైపు, ఎడమ వైపు ఉండే ఆ ఎద్దుల్ని ఎప్పుడూ అలాగే కట్టాలి. అది బండి కట్టేవాడికే తెలుస్తుంది. అటుదిటు అయిందంటే అలవాటు లేక అసౌకర్యానికి గురై బండిని ఎటో లాగేస్తాయి'' అన్నాడొక పెద్దమనిషి, వైశంపాయనుడిని బురదలోంచి బయటకు లాగుతూ. ''కుడి ఎడమైతే పొరబాటు లేదన్నారుగా మరీ?'' అన్నాడు వైశంపాయనుడు అదోలా మొహం పెట్టి.

*